

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మహబూబాబాద్
మంగళవారం 16 ఏప్రిల్ 2024



వడ్డీ మాఫియా!



వరంగల్‌లోని ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ కార్పొరేటర్ ప్రజల నుంచి నెలవారీ చిట్టీల పేరుతో సుమారు రూ.2కోట్ల వరకు డబ్బులు వసూలు చేశాడు. చివరకు వసూలు చేసిన డబ్బులను తనకు చిట్టీలు కట్టిన వారికి ఇవ్వకుండా.. తనకే నష్టం వచ్చిందని బెదిరింపులకు దిగాడు. దీంతో బాధితులు ఇంతేజార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తీసుకున్న అప్పు చెల్లించలేదంటూ హనుమకొండకు చెందిన ఓ వ్యక్తిని... తమకు ఇంటి స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయాలని వడ్డీ వ్యాపారి ఒత్తిడి చేస్తున్నాడు. దీంతో ఆ బాధితుడు లబోదిబోమంటున్నాడు.

వరంగల్ రంగాశాయపేటలో అధిక వడ్డీ బాధితుడు ఒకరు సొంత ఇంటిని, ఇంటి స్థలాన్ని కోల్పోయాడు. రూ.1లక్ష అప్పు తీసుకుంటే.. నాలుగేళ్లలో సొంతింటిని కోల్పోయే స్థాయిలో అతడి అప్పులు పెరిగిపోయాయి. దీంతో బాధితుడి కుటుంబం వీధిన పడింది.

శివనగర్‌లో ఓ యువకుడు వడ్డీ వ్యాపారి నుంచి రూ.1.30లక్షల అప్పు తీసుకున్నారు. దీనికి రూ.10 చొప్పున వడ్డీ చెల్లిస్తున్నాడు. ఏడాది కాలంలోనే రూ.1.38లక్షల అప్పునకు రూ.1.28లక్షల వడ్డీ చెల్లించాడు. అయితే ఆరోగ్యం బాగా లేకపోవటంతో అసలు డబ్బు మాత్రం చెల్లించక పోవడంతో వడ్డీ వ్యాపారి వేధించడం మొదలు పెట్టడంతో బాధితుడు మిల్స్ కాలనీ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

- జనం అవసరాలే ఆసరాగా కొందరి అధిక వడ్డీ దందా
- రూ.100కు రూ.10 చొప్పున వడ్డీ వసూలు
- మైక్రో ఫైనాన్స్, నెలవారీ చిట్టీల పేరిట జనం సొమ్ము దోపిడీ
- అక్రమంగానే వ్యవహారమంతా..
- చోటా మోటా నేతలు, కొందరు కార్పొరేటర్లు, వారి అనుచరులే సూత్రధారులు
- రూరల్ ప్రాంతాల్లో వడ్డీపై పోలీసుల ఉక్కుపాదం
- నగరంలో మాత్రం ఖాకీలది ప్రేక్షక పాత్రే!

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి- వరంగల్)

రూ.100కు రూ.10, రూ.వెయ్యికి రూ.100, రూ.లక్షకు రూ.పది వేలు.. ఇదీ వడ్డీ వ్యాపారుల లెక్క.. జనాల అవసరాలను ఆసరాగా చేసుకుని జలగల్లా పట్టి పీడిస్తున్న వడ్డీ మాఫియా కథ. ప్రజల అవసరాన్ని ఆసరాగా చేసుకుని కొందరు అధిక వడ్డీకి అప్పులు ఇస్తూ.. ఆస్తులు, బంగారం తాకట్టు పెట్టుకుంటున్నారు. ఆ అప్పు చెల్లించకుంటే తాకట్టు పెట్టుకున్న ఆస్తిని జప్తు చేసుకుంటున్న సంఘటనలున్నాయి.

దీంతో అధిక వడ్డీలు చెల్లించలేక మానసిక, ఆర్థిక ఒత్తిడితో అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో పోలీసుల అండదండలతోనే ప్రైవేట్, డైలీ ఫైనాన్స్ మాఫియా రెచ్చిపోతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అవసరాలే ఆసరాగా...

డబ్బు అత్యవసరం ఉన్న ప్రజలే లక్ష్యంగా కొందరు వడ్డీ వ్యాపారులు తమ దందా సాగిస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అన్ని జిల్లా కేంద్రాలతో పాటు మునిసి పాలిటీల్లో గిరిగిరి దందా జోరుగా సాగుతోంది. ఎలాంటి అనుమతులు లేకుండా జరుగుతున్న ఈ వ్యవహారంతో అనేక మంది జీవితాలు వీధిన పడుతున్నాయి. ముఖ్యంగా చిరు వ్యాపారులు, కూరగాయలు, పండ్లు విక్రయించే వీధి వ్యాపారులు, ఆటో నడుపుకొనే వారు, కూలీలు లక్ష్యంగా వడ్డీ వ్యాపారం జరుగుతోంది. డబ్బులు అత్యవసరం ఉన్నవారి నుంచి రూ.100కు రూ.10వడ్డీ వసూలు చేస్తున్నారు. రూ.10వేల అప్పు తీసుకున్న వారికి రూ.వెయ్యి కోత పెట్టి రూ.9వేలు ఇస్తున్నారు. వారానికి రూ.వెయ్యి చొప్పున పదివారాల్లో వసులు చేస్తున్నారు. ఇంకొన్ని చోట్ల ఉదయం రూ.900 ఇచ్చి సాయంత్రం రూ.వెయ్యి తీసుకుంటున్నారు. 12గంటల తిరగక ముందే ఒక వెయ్యి రుపాయలకు రూ.100 వడ్డీ వసూలు చేస్తున్నారు. ఇలా ఒక రోజు లక్ష రుపాయలు వడ్డీకి ఇస్తే ఒక రోజులోనే రూ.10 వేల వడ్డీ లాగేస్తున్నారు. నెలకు రూ.వెయ్యికి రూ.వంద వడ్డీ చొప్పున వసూలు చేస్తున్నారు. అప్పు ఇచ్చే సమయంలో ఖాళీ చెక్కులు, పట్టాదారు పాసు పుస్తకాలు, బంగారు నగలు, స్థిరాస్తి హక్కు పత్రాలు, ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లు ఇతర వాహనాలను తాకట్టు పెట్టుకుంటున్నారు. ఒక వేళ ఏదైనా కారణాలతో అప్పు చెల్లించకపోతే తాకట్టు పెట్టుకున్న ఆస్తిని లాక్కుంటున్నారు. ఖాళీ చెక్కులతో కోర్టుల చుట్టూ తిప్పుతూ ఇబ్బందులు పెడుతున్నారు. దీంతో చాలామంది మానసికంగా ఒత్తిడికి గురవుతున్నారు. సమాజంలో పరువు పోతుందని కొందరు ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్న సంఘటనలు ఉన్నాయి.

దందాలో రాజకీయ నేతలు, టీచర్లు, పోలీసులు

గిరిగిరి దందాలో కొందరు రాజకీయ నేతలతో పాటు చాలా ప్రాంతాల్లో కొందరు టీచర్లు కూడా ఉన్నారు. ప్రధానంగా వరంగల్ పోలీస్‌కమిషనరేట్ పరిధిలో వడ్డీ వ్యాపారం జోరుగా సాగుతుంది. కొన్ని ఏరియాల్లో పోలీసుల అండదండలతోనే అధిక వడ్డీ వ్యాపారం సాగుతున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. వరంగల్ తూర్పు ప్రాంతంలో ముగ్గురు కార్పొరేటర్లు, మరో నలుగురు మాజీ కార్పొరేటర్లు వడ్డీ వ్యాపారం రూ.లక్షల్లో సాగిస్తున్నారు. అధికార పార్టీ అండదండలు కొందరికి ఉండగా, మరికొందరికి ఖాకీల సాన్నిహిత్యం ఉన్నట్లు సమాచారం. దీంతో శివనగర్, రంగాశాయిపేట, బట్టల బజారు, ఉర్సు, రైల్వేగేటు, మిల్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో గిరిగిరితో పాటు రూ.లక్షల్లో వడ్డీ వ్యాపారం సాగిస్తున్నారు. అధికార బలంతో పాటు ఖాకీల సహకారం ఉండటంతో ఫైనాన్స్ దందాను యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. వరంగల్ పశ్చిమ

మిగతా 7వ పేజీలో..

చిట్టీల పేరిట చీటింగ్

కొందరు నెలవారీ చిట్టీల పేరుతో ప్రజలను దోచుకుంటున్నారు. రూ.లక్ష చిట్టీని 25మంది నెలకు రూ.4వేల చొప్పున 25నెలలు చెల్లించాలి. ఇందులో డ్రా తీసి ఎవరికి వస్తే వారికి కొందరు చెల్లిస్తుండగా, ఎవరు ఎక్కువ పాట పాడితే వారికి ఇస్తున్నారు. డబ్బులు అత్యవసరం ఉన్నవారు రూ.లక్షకు రూ.25వేల వరకు కూడా పాడి డబ్బులు తీసుకుంటున్నారు. దీంతో 25శాతం వడ్డీ చెల్లించాల్సి వస్తుంది. పైగా చిట్టీ నిర్వహకులు కూడా ప్రతీ వ్యక్తి నుంచి 5శాతం కమీషన్‌గా తీసుకుంటున్నారు. అయితే ఈ చిట్టీల వ్యాపారుల్లో కొందరు.. తమకు చిట్టీల డబ్బులు చెల్లించిన వారికి ఇవ్వకుండా ఉడాయించిన సంఘటనలున్నాయి. అలాగే మండల కేంద్రాల్లో లక్కీ డ్రాల పేరుతో ద్విచక్ర వాహనాలను ఆశ చూపుతు లక్షల్లో వసూళు చేసి దుకాణం మూసేస్తున్నారు.



కమిషనరేట్ పరిధిలో మౌనమేల?

అధిక వడ్డీ వ్యాపారులపై రాష్ట్ర వ్యాప్తంగా దాడులు జరుగుతుంటే.. వరంగల్ కమిషనరేట్ పరిధిలోని పోలీసులు మౌన ముద్రలో ఉండటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భూ పాలపల్లి జిల్లా కేంద్రంలో ఈ నెల 8వ తేదీన ఫైనాన్స్ వ్యాపారి వేధింపులు భరించలేక గణేష్ చౌరస్తాలో నివాసం ఉంటున్న బయ్యావుల ఏడు కొండలు అనే చిరు వ్యాపారి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసుశాఖ రాష్ట్రవ్యాప్తంగా వడ్డీ వ్యాపారులపై నిఘా పెట్టి తనిఖీలు చేపడుతుంది. ములుగు పోలీసులు ఏటూరునాగరంలోని ఓ మహిళ వడ్డీ వ్యాపారి ఇంట్లో సోదాలు చేసి, విలువైన దస్త్రాలు స్వాధీనం చేసుకున్నారు. భూపాలపల్లి జిల్లాలో భూపాలపల్లి, మహదేవపూర్‌లోని వడ్డీ వ్యాపారుల ఇళ్లలో సోదాలు చేశారు. అయితే వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మాత్రం వడ్డీ వ్యాపారులపై పోలీసుల దాడులు లేకపోవడం వెనుక మతలబు ఏంటన్న చర్చ జరుగుతోంది. ఇక్కడి వడ్డీ వ్యాపారుల్లో అనేక మంది రాజకీయ నేతలు, వారి అనుచరులు ఉండటంతోనే వారిని టచ్ చేసేందుకు ఖాకీలు సాహసం చేయడం లేదన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కోట్లాది రుపాయలను అధిక వడ్డీలకు తిప్పుతు న్నారనే సమాచారం ఉన్నా పోలీసులు పట్టించుకోకపోవడం చర్చనీయాంశంగా మారింది. 2022 జూలై 28న వడ్డీ వ్యాపారుల వేధింపులు తట్టు కోలేక ఓ మహిళ మట్టేవాడ మహిళ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించింది. పోలీసులు వడ్డీ వ్యాపారికి వత్తాసు పలకటంతో పోలీస్‌స్టేషన్‌లోనే పురుగుల మందు తాగిన సంఘటన ఖాకీల పరువును బజారున పడేసింది. అయినప్పటికీ పోలీసుల తీరులో మాత్రం మార్పు రాలేదన్న చర్చ జరుగుతోంది.

గ్రూప్-1 పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): టీఎస్‌పీఎస్సీ ద్వారా జూన్‌లో జరిగే గ్రూప్-1 పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అధికారులను ఆదేశించారు. మహబూబాబాద్‌లోని కలెక్టర్ కార్యాలయంలో టీఎస్‌పీఎస్సీ గ్రూప్-1 పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై సోమవారం అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ మాట్లాడుతూ... జిల్లాలో గ్రూప్-1 పరీక్షలకు అన్ని మౌలిక వసతులు ఉన్న కేంద్రాలను గుర్తించాలని, అధికారులు ప్రతి సెంటర్‌ను క్షుణ్ణంగా పరిశీలించి ఎంపిక చేయాలన్నారు. పరీక్ష కేంద్రాలకు ఫ్లయింగ్ స్క్వాడ్‌గా తహసీల్దార్ లేదా సమాన క్యాడర్‌గా సీనియర్ జిల్లా అధికారులను నియమించేందుకు రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ ఉత్తర్వుల జారీ, పరీక్ష రోజున 3 కిలోమీటర్ల పరిధిలోని అన్ని జిరాక్స్ సెంటర్లను మూసివేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్ష హాల్‌లోకి ఎలక్ట్రానిక్ గాడ్జెట్‌లను తీసుకువెళ్లకుండా నిరోధించడానికి పోలీసు శాఖ పటిష్ట బందోబస్తు, భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే ఆర్టీసీ అధికారులు రవాణా ఏర్పాట్లు చేయాలని అన్నారు. పరీక్ష సమయంలో నిరంతర విద్యుత్ సరఫరాకు విద్యుత్ అధికారులు, అత్యవసర వైద్య సేవలు అందించేందుకు వైద్యాధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పో, ఎం.డేవిడ్, అదనపు ఎస్పీ చెన్నయ్య, ఆర్డీవోలు అలివేలు, నర్సింహారావు, జిల్లా అధికారులు శ్రీనివాస్, సత్యనారాయణ, శివప్రసాద్, రామారావు, కళావతి భాయి, భద్రకాళి, అనురాధ, భరత్ పాల్గొన్నారు.

మోదీ చరిష్మాతోనే బీజేపీ అభ్యర్థుల గెలుపు

మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి అజ్మీరా సీతారాం నాయక్



మరిపెడ బంగ్లాలో మాట్లాడుతున్న అజ్మీరా సీతారాంనాయక్

మరిపెడ, ఏప్రిల్ 15: ప్రధానమంత్రి నరేంద్రమోదీ చరిష్మాతోనే తెలంగాణలోని 17 పార్లమెంట్ స్థానాల్లో బీజేపీ అభ్యర్థులు గెలువడం ఖాయమని మహబూబాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి అజ్మీరా సీతారాంనాయక్ అన్నారు. సోమవారం ఆయన మరిపెడ బంగ్లాలోని బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. జమ్మూకశ్మీర్ సమస్యకు మోదీ పరిష్కారం చూపారన్నారు. పేదలకు ఉచితంగా ఆహార ధాన్యాలను అందిస్తున్నారని గుర్తుచేశారు. దేశాన్ని సంపన్న దేశాల సరసన చేర్చారన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మోసాలను ప్రజలు గుర్తించారని తెలిపారు. ఆ రెండు పార్టీలకు పార్లమెంట్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పనున్నట్లు పేర్కొన్నారు. తాను ఎంపీగా చేసిన వివిధ అభివృద్ధి పనులకు ఇప్పటి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సాక్ష్యమన్నారు. సమావేశంలో భూక్యా సంగీత, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ధర్మారపు వెంకన్న, భూక్యా కాంతమ్మ, కట్టోజ్ గంగాధర్, లింగంనాయక్, సుధాకర్, భాస్కర్, హుస్సేన్‌నాయక్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ప్రజలు ఓటేయొద్దు..

దంతాలపల్లి : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయొద్దని మహబూబాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి సీతారాంనాయక్ అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి చెందిందన్నారు. దేశ యువత నరేంద్ర మోదీ వైపు ఉన్నారన్నారు. తాను ఎంపీగా ఉన్న సమయంలో హైవే రోడ్డు, గిరిజన తండాల్లో సీసీ రోడ్డు పనులు, తాగు, సాగునీటి వసతులను కల్పించానన్నారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో తాను కీలక పాత్ర పోషించానని తెలిపారు. మే నెలలో జరిగే ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీకి ప్రజలు ఓట్లు వేయకూడదని కోరారు. ఎన్ని శక్తులు అడ్డొచ్చినా తన గెలుపును ఎవరూ ఆపలేరని సీతారాంనాయక్ పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు భూక్య సంగీత, జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి మహేష్‌గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి దాసరి మురళి, ఉపాధ్యక్షుడు అల్లం సాయికుమార్, రాణిరెడ్డి, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్‌పీలో చేరిన పంజా కల్పన

- వరంగల్ ఎంపీ అభ్యర్థిగా ప్రకటన



పంజా కల్పనకు పార్టీ సభ్యత్వం అందిస్తున్న రాష్ట్ర నాయకులు

తొర్రూరు, ఏప్రిల్ 15: తొర్రూరు పట్టణానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకురాలు పంజా కల్పన తన అనుచరులతో సోమవారం బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ)లో చేరారు. హైదరాబాద్‌లోని బీఎస్పీ రాష్ట్ర కార్యాలయంలో కోఆర్డినేటర్ బాలయ్య, రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ ఆధ్వర్యంలో ఆ పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బహుజన సమాజ్ పార్టీ సబ్బండ కులాల సంక్షేమం కోసం ఉద్యమిస్తూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని తెలిపారు. సమసమాజ స్థాపన కేవలం బహుజన సమాజ్ పార్టీతోనే సాధ్యం అవుతుందన్నారు. ప్రజాహితం కోసం చేపట్టే ప్రజా కార్యక్రమాలను చూసి పార్టీలో చేరుతున్నారని, పార్టీలో చేరిన వారికి భవిష్యత్‌లో మంచి పదవులు లభిస్తాయన్నారు. కాగా, బీఎస్పీ వరంగల్ ఎంపీ అభ్యర్థిగా పంజా కల్పనను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కల్పన మాట్లాడుతూ పార్టీ చేపట్టే ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై వరంగల్ పార్లమెంట్ పరిధిలో పార్టీ బలోపేతం కోసం అన్ని విధాలుగా కృషి చేస్తానన్నారు. తనను ఆదరించి పార్టీలోకి ఆహ్వానించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మంద పూర్ణ, అష్రఫ్, యాకయ్య, సమ్మయ్య, శంకర్, దీపక్, రాధిక, మహేష్, వంశీ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాలకు నీడేదీ?

- కలెక్టరేట్‌ను నిర్మించారు.. షెడ్డును మరిచారు..
- ఎండకు ఎండుతూ వానకు తడుస్తున్న వైనం
- శాఖల కార్యాలయాల సూచిక బోర్డులు లేక జనం ఇక్కట్లు

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 15: మహబూబాబాద్ పట్టణంలో కోట్లాది రూపాయలు వెచ్చించి కలెక్టరేట్‌ను నిర్మించారు. అందులో వాహనాలను నిలిపేందుకు షెడ్డును ఏర్పాటు చేయకపోవడంతో ఎండకు ఎండుతూ వానకు తడుస్తున్నాయి. జిల్లా కేంద్రంలో అన్ని శాఖల కార్యాలయాలు ప్రజలకు అందుబాటులో ఉండేలా ఇంటి గ్రేటెడ్ డిస్ట్రిక్ట్ ఆఫీసెస్ కాంప్లెక్స్ (ఐడీవోసీ)ను నిర్మించారు. అలాగే వాహనాలను నిలిపేందుకు ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాన్ని కేటాయించి షెడ్డును నిర్మించలేదు. అటు అధికారులు, ఇటు వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు, ప్రజా ప్రతినిధులు తమ వాహనాలను కలెక్టరేట్ భవనం చుట్టూ నిలుపుతున్నారు. జీప్లస్ టుగా నిర్మించిన కలెక్టరేట్ భవనంలో ఏఏ అంతస్తులో ఏ శాఖల కార్యాలయాలు ఉన్నాయో గ్రౌండ్ ఫ్లోర్‌లో సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆయా శాఖల్లో పనుల కోసం వచ్చిన వారు ఆఫీసులను వెతుక్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. వాహనాల కోసం షెడ్డు నిర్మాణంతో పాటు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

కలెక్టరేట్ ప్రారంభమై ఏడాదైనా..

తెలంగాణ రాష్ట్రం సిద్ధించాక పాలన సౌలభ్యం కోసం మాజీ సీఎం కేసీఆర్ 11 అక్టోబరు, 2016న నూతన జిల్లాలు, కొత్త మండలాలను ఏర్పాటు చేశారు. అప్పట్లో పూర్వ 12 మండలాలతో పాటు చిన్నగూడూరు, గంగారం, పెద్దవంగర, దంతాలపల్లి నూతన మండలాలను కలిపి మొత్తంగా 16 మండలాలతో మానుకోట జిల్లాను ఏర్పాటు చేశారు. తాత్కాలికంగా ఐటీడీఏ యూత్ ట్రైనింగ్ సెంటర్ (వైటీసీ) బిల్డింగ్‌లో జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని, ఇతర శాఖల కార్యాలయాలను ఏర్పాటు చేశారు. ప్రజలకు అన్ని శాఖలు ఒకే చోట అందుబాటులో ఉండాలనే సంకల్పంతో నూతన జిల్లాల్లో ఐడీవోసీలను నిర్మించారు. అందులో భాగంగా పట్టణ శివారు ఎన్‌హెచ్-365 జాతీయ రహదారిలోని కురవి రోడ్డులో ఉన్న సాలార్‌తండా సమీపంలో 21 ఎకరాల 30 గుంటల ప్రభుత్వ భూమిని కేటాయించారు. అందులో 2018 ఏప్రిల్‌లో అప్పటి మంత్రి కేటీఆర్‌చే శంకుస్థాపన చేయగా, భవనం పూర్తయ్యాక 12 జనవరి, 2023లో అప్పటి సీఎం కేసీఆర్ చేతుల మీదుగా లాంఛనంగా ప్రారంభించారు.



కలెక్టర్ కార్యాలయంలో షెడ్డు లేక ఎండకు ఎండుతున్న వాహనాలు

షెడ్డు లేక..

కలెక్టరేట్ ప్రారంభమై ఏడాది గడిచినప్పటికి వాహనాల కోసం షెడ్డు ఏర్పాటుపై దృష్టి సారించక పోవడంతో అవి ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ ఉన్నాయి. వేసవిలో తీవ్రమైన ఎండ ఉండడంతో చెట్టు నీడ ఉన్న చోట వాహనాలను నిలుపుకుంటున్నారు. జిల్లాలోని 16 మండలాలు, 461 గ్రామ పంచాయతీలకు సంబంధించిన ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు వివిధ పనుల నిమిత్తం కలెక్టరేట్‌కు వస్తుండగా వాహనాల రద్దీ పెరుగుతోంది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యేకంగా షెడ్డు నిర్మించి వాహనాలకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.



కలెక్టర్ కార్యాలయంలో చెట్టు నీడకు నిలిపిన వాహనాలు

సూచిక బోర్డులు లేక ఇక్కట్లు..


ప్రజలకు అన్ని శాఖలు అందుబాటులో ఉండాలనే ఉద్దేశ్యంతో నిర్మించిన ఐడీవోసీలో శాఖల ఆఫీసులకు దారి చూపే విధంగా సూచిక బోర్డులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు మొదటి, రెండవ అంతస్తులో కార్యాలయాలు ఉండడం.. ఏఏ ఫ్లోర్‌లో ఏఏ శాఖల కార్యాలయాలు ఉన్నాయో తెలిసే విధంగా గ్రౌండ్ ఫ్లోర్‌లో సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో పనుల కోసం వచ్చిన ప్రజలు ఆఫీసులు ఎక్కడా ఉన్నాయో తెలుసుకుని వెళ్లాల్సి వస్తోంది. మొదటి, రెండవ అంతస్తులకు దారి అని మాత్రమే సూచిక బోర్డులు పెట్టారు. వాటితో పాటు మొదటి, రెండవ అంతస్తులో ఉన్న శాఖల కార్యాలయాలకు మార్గం చూపే విధంగా శాఖల పేర్లతో సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని గతంలో మహబూబాబాద్ వినియోగదారుల సంక్షేమ మండలి ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో విజ్ఞప్తి చేశారు. సూచిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రజల ఇబ్బందులను తొలగించాలని కోరుతున్నారు.



వాహనాల కోసం షెడ్డు నిర్మించాలి

నక్క నాగార్జున, మానుకోట

జిల్లా కలెక్టరేట్‌లో వాహనాల కోసం ప్రత్యేకంగా షెడ్డును నిర్మించాలి. షెడ్డు లేక పోవడంతో వివిధ పనుల నిమిత్తం వచ్చిన వారి వాహనాలు ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తున్నాయి. ఎక్కడైనా చెట్టు నీడ కన్పిస్తే అక్కడ వాహనాన్ని నిలపాల్సి వస్తోంది. కలెక్టరేట్‌లో వాహనాల కోసం షెడ్డును ఏర్పాటు చేయాలి.



సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి

మైస శ్రీనివాస్, వినియోగదారుల సంక్షేమ మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి

కలెక్టరేట్‌లో ప్రభుత్వ శాఖల కార్యాలయాలకు వెళ్లేందుకు మార్గాన్ని సూచించే సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. ఏఏ అంతస్తులో ఏఏ కార్యాలయాలున్నాయో తెలిసే విధంగా గ్రౌండ్ ఫ్లోర్‌లో సూచిక బోర్డులను ఏర్పాటు చేస్తే ప్రజలు సునాయాసంగా ఆయా శాఖల కార్యాలయాలకు వెళ్తారు. ఏ ఫ్లోర్‌లో ఏ కార్యాలయం ఉందో తెలియక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

మార్కెట్‌కు పోటెత్తిన మొక్కజొన్న

- రికార్డు స్థాయిలో 17వేల బస్తాల పంట రాక
- కేసముద్రంలో గరిష్ఠంగా రూ.2,163 పలికిన ధర



కేసముద్రం మార్కెట్‌కు విక్రయానికి వచ్చిన మొక్కజొన్న పంట

కేసముద్రం, ఏప్రిల్ 15: కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు సోమవారం రికార్డు స్థాయిలో 17వేల బస్తాల మొక్కజొన్న రాబడులు కొనసాగాయి. మార్కెట్‌కు 252 మంది రైతులు 17,881 బస్తాల్లో 10,728 క్వింటాళ్ల మొక్కజొన్నలు విక్రయించేందుకు తీసుకువచ్చారు. ఎలక్ట్రానిక్ నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్(ఈ-నామ్) విధానంలోని ఈ-వేలంలో మొక్కజొన్నలు క్వింటాకు గరిష్ఠంగా రూ.2,163, కనిష్ఠంగా రూ.1,951, సగటున రూ.2,149 ధరలతో వ్యాపారులు ఖరీదులు చేశారు. ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకు రంజాన్, వారాంతపు సెలవుల నేపథ్యంలో నాలుగు రోజుల అనంతరం మార్కెట్ ప్రారంభం కావడంతో మొక్కజొన్నలు ఒక్కసారిగా పోటెత్తాయి. మొక్కజొన్న కాంటాలు జరుగుతుండగానే మరుసటి రోజు విక్రయించేందుకు ముందుగానే రైతులు తమ మక్కలను తీసుకువస్తున్నారు. మార్కెట్ గేటు ముందు మొక్కజొన్నలు తీసుకువస్తున్న వాహనాలు బారులు తీరాయి. దీంతో కవర్‌షెడ్లు, ఓపెన్ యార్డులు పూర్తిగా మొక్కజొన్నలతో నిండిపోయాయి. భారీగా సరుకు రావడంతో కాంటాలు రాత్రి వరకు కొనసాగాయి.

సోమవారం ఉష్ణోగ్రతలు	గరిష్ఠం : 40.0°C	కనిష్ఠం : 24.5°C

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

బాలసముద్రం, ఏప్రిల్ 15: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని దళిత, గిరిజన టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పెండ్యాల కొమురయ్య ఒక ప్రకటనలో సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా కొమురయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టి వారి సమస్యలను పరిష్కరించాలని పెండ్యాల కొమురయ్య డిమాండ్ చేశారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంద నరేశ్

వరంగల్ లోక్‌సభ బరిలో ఉంటా..

ఏబీఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 15: వరంగల్ లోక్‌సభ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని ఏబీఎస్ఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్ చెప్పారు. సోమవారం కేయూలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంద నరేశ్ మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో విద్యార్థి ఉద్యమకారులకు ఏ రాజకీయపార్టీ టికెట్లు కేటాయించకపోవడాన్ని ఖండించారు. తాను విద్యార్థి సమస్యలపై పోరాటం చేసినట్లు తెలిపారు. పోరాటాలు చేసిన క్రమంలో కేసులపాలైనట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడినట్లు వివరించారు. పార్టీలు మారిన రాజకీయ నాయకులకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. తాను ఎంపీగా గెలిస్తే నీతి, నిజాయితీగా పనిచేస్తానని, అందరూ తనను ఆశీర్వదించి గెలిపించాలని అన్నారు. ఈ సమావేశంలో కేయూ విద్యార్థి నాయకులు అరిస్టాటిల్, వివేకనంద, సిద్ధు, నవీన్, కిరణ్, సాయి, వెంకటేశ్, సందీప్, కల్యాణ్, సురేశ్, రాజు, రమేశ్, నరేందర్, సూర్య, దిలీప్, శివ పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి ఇద్దరు మృతి

కాజీపేట, ఏప్రిల్ 15: ఉప్పల్ రైల్వేస్టేషన్ పరిధిలో రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు ప్రయాణికులు మృతిచెందారు. కాజీపేట రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్ ఆగ్రాకు చెందిన అరుణ్ (21) ఆగ్రా నుంచి హైదరాబాద్‌కు వెళ్లేందుకు దక్షిణ్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తుండగా సోమవారం ఉప్పల్ రైల్వేస్టేషన్ వద్ద రైలు నుంచి జారిపడి మృతి చెందాడు. కాగా, సిర్పూర్ కాగజ్‌నగర్‌కు చెందిన ఫిరోజ్ (25) సికింద్రాబాద్‌కు వెళ్లేందుకు సోమవారం కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ రైల్లో ప్రయాణిస్తుండగా హసన్‌పర్తి రైల్వే స్టేషన్ ఫిరోజ్ రైలు నుంచి జారిపడ్డాడు. ఈ ఘటనలో అతడి రెండు కాళ్లు తెగిపడ్డాయి. రైల్వే ఉద్యోగుల సమాచారం మేరకు అపస్మారక స్థితిలో ఉన్న ఫెరోజ్‌ను ఎంజీఎంకు తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందాడు. మృతుల వద్ద ఆధారాల మేరకు వారి కుటుంబీకులకు సమాచారం ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు.

కడియం కావ్యకు సంపూర్ణ మద్దతు

కాజీపేట, ఏప్రిల్ 15: కాంగ్రెస్ లోక్‌సభ వరంగల్ అభ్యర్థి కడియం కావ్యకు తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని మాదిగ హక్కుల దండోరా, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు జన్ను కనుకరాజ్, ఈటక రాజు మాదిగ తెలిపారు. ఈ సందర్భంగా కాజీపేట సోమవారం మీడియా పాయింట్‌లో మాట్లాడారు. ఎస్సీలకు వంద రోజుల్లో వర్గీకరణ చేస్తామని చెప్పిన బీజేపీ మాదిగలకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. బీజేపీకి మద్దతు ప్రకటిస్తున్న మంద కృష్ణ మాదిగను మాదిగలు వ్యతిరేకిం చాలన్నారు. మాదిగలకు తీవ్ర అన్యాయం చేసిన బీజేపీ అభ్యర్థులను మాదిగలంతా ఐక్యంగా వుండి లోక్‌సభ ఎన్నికల్లో ఓడించాలన్నారు. ఈ మీడియా సమావేశంలో మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె. పద్మయ్య జిల్లా అధ్యక్షులు వేముల బలరాములు, నాయకులు కోరిపల్లి శ్రీనివాస్, వీరయ్యసి. బాలరాజ్, కొట్టి శ్రావణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేటి 5కే రన్ వాయిదా

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్ 15: ఓటరు చైతన్యంపై నేడు ఉదయం 6గంటలకు నిర్వహించే 5 కేరన్‌న అనివార్య కారణాల వల్ల వాయిదా వేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మళ్లీ 5కే రన్ ఎప్పుడు నిర్ణయించేది త్వరలో చెబుతామని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

హత్యానేరం కేసులో ఒకరికి జీవిత ఖైదు, జరిమానా

వరంగల్ లీగల్, ఏప్రిల్ 15: పాత కక్షలు దృష్టిలో పెట్టుకొని ఒకరిని అతిదారుణంగా హత్యచేసిన వ్యక్తిపై నేరం రుజువైనందున యావజ్జీవ కారాగార శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ హనుమకొండ జిల్లా ప్రధాన సెషన్స్ జడ్జి ఎం.కృష్ణమూర్తి సోమవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

హనుమకొండ జిల్లా కాజీపేట మండలం రాంపేట గ్రామానికి చెందిన అలుపుల సమ్మయ్యకు అదే గ్రామానికి చెందిన దడబోయిన శంకరయ్యకు చిన్నచిన్న తగాదాలు ఉండేవి. రెండేళ్ల కిందట అలుపుల సమ్మయ్య.. శంకరయ్యపై దాడి చేయడంతో మడికొండ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. అప్పటి నుంచి ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. పాతకక్షలు మనసులో పెట్టుకొని 2021జూలై 10న ఎప్పటిలాగా అలుపుల సమ్మయ్య ఉదయం సమయంలో మనవడితో కలిసి యోగా, వాకింగ్ చేయడానికి వెళ్లాడు. ఇది గమనించిన శంకరయ్య యోగా చేస్తున్న సమ్మయ్యపై గొడ్డలితో దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈవిషయాన్ని అదేగ్రామానికి చెందిన కట్ట వీరారెడ్డి.. సమ్మయ్య భార్యకు తెలపడంతో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుంది. అనంతరం తన భర్త అలుపుల సమ్మయ్యపై దాడి చేసి కిరాతకంగా చంపిన దడబోయిన శంకరయ్యపై మడికొండ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు నిందితుడు శంకరయ్యపై హత్యానేరం కేసు నమోదు చేశారు. కేసు విచారణలో నేరం రుజువైనందున నిందితుడికి జీవిత ఖైదు, రూ.5వేల జరిమానా విధిస్తూ న్యాయ మూర్తి తీర్పు వెలువరించారు. కోర్టు పీసీ వి.రాజేష్ సాక్షులను ప్రవేశపెట్టగా మంతెన రవికుమార్, డి.ప్రతాప్ దర్యాప్తు అధికారులుగా వ్యవహరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.సత్యనారాయణ కేసు వాదించారు.

కేజీబీవీ విద్యార్థినులకు ఎప్‌సెట్ కోచింగ్

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 154 మంది విద్యార్థులకు షార్ట్ టర్మ్ కోచింగ్

ర్యాంకులే లక్ష్యంగా హసన్‌పర్తి కేజీబీవీలో నెల పాటు సాగనున్న ఉచిత శిక్షణ



హసన్‌పర్తి కేజీబీవీ ఎప్‌సెట్ కోచింగ్ సెంటర్‌లో తరగతులు

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 12: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో (కేజీబీవీ) చదువుకుంటున్న విద్యార్థినులకు ఇకనుంచి ఎప్‌సెట్ (ఇంజినీరింగ్ అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ)లో ర్యాంకుల పంట పండనుంది. ఇందుకోసం ఈ ఏడాది నుంచి ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన కేజీబీవీల్లో ఎప్‌సెట్ షార్ట్ టర్మ్ కోచింగ్‌ను నెల పాటు ప్రభుత్వం అందిస్తుంది. దీంతో ర్యాంకుల సాధనలో ప్రైవేటు, ప్రతిభ గురుకుల జూనియర్ కళాశాలల సరసన కేజీబీవీలు చేరనున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా కేజీబీవీల్లో ఈ విద్యా సంవత్సరం ఇంటర్మీడియెట్ రెండో సంవత్సరం పరీక్షలు రాసిన 154 మంది విద్యార్థులను ఎంపిక చేసి హనుమకొండ జిల్లాలోని హసన్‌పర్తి కేజీబీవీలో నెల పాటు ఉచితంగా వసతులతో కూడిన ఎప్‌సెట్ ఫ్రీ షార్ట్ టర్మ్ కోచింగ్ అందిస్తున్నారు. ఏప్రిల్ 1న ప్రారంభమైన ఈ కోచింగ్ మే 1తో ముగియనుంది.

విద్యార్థులకు వరం

ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కేజీబీవీల్లో చదువుతున్న విద్యార్థినులకు వరంగా మారింది. ఈ ఏడాది నుంచి కేజీబీవీల్లో ఇంటర్ విద్య పూర్తి చేసిన వారికి అదే ఏడాది ఎప్‌సెట్‌కు నెల రోజుల పాటు షార్ట్ టర్మ్ కోచింగ్ ఇవ్వడంపై కేజీబీవీల విద్యార్థినులు ప్రైవేటు, ఆదర్శ గురుకుల జూనియర్ కళాశాలల పక్కన చేరనున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్, హనుమకొండ, జనగామ, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలోని కేజీబీవీల్లో చదువుతున్న 154మంది విద్యార్థినులకు హసన్‌పర్తి కేజీబీవీలో ఏప్రిల్ 1 నుంచి ఎప్‌సెట్ కోచింగ్ క్యాంపు ప్రారంభమైంది. అన్ని వసతులతో కూడిన ఉచిత శిక్షణను ఇక్కడ నెల రోజుల పాటు అందించనున్నారు.

నిష్ణాతులైన అధ్యాపక బృందం

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా కేజీబీవీల్లో బోధిస్తున్న పీజీసీఆర్‌టీల్లో మెరికలైన వారిని ఎంపిక చేసి వారితో విద్యార్థినులకు కోచింగ్ ఇస్తున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిరంతరాయంగా కోచింగ్ తరగతులు నిర్వహిస్తున్నారు. ఎంపీసీ, బైపీసీ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసిన విద్యార్థినులకు ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ తదితర విభాగాల్లో సీట్లు సాధించేందుకు తర్ఫీదు ఇస్తున్నారు. ప్రతీ విద్యార్థినిపై దృష్టిపెట్టి కోచింగ్ సాగుతోంది. కోచింగ్‌తో పాటు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్నారు. సబ్జెక్టులో టాపిక్‌లు పూర్తి కాగానే అందులో విద్యార్థుల టెస్టులు నిర్వహిస్తూ పూర్తిగా కార్పొరేట్ స్థాయిలో కోచింగ్ నిర్వహిస్తున్నారు. ఈ కోచింగ్ సఫలీకృతమైతే కేజీబీవీ విద్యార్థులకు ఎప్‌సెట్‌లో ర్యాంకుల పంట పండనుంది.

జిల్లాల వారీగా విద్యార్థినులు సంఖ్య

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 154 మంది విద్యార్థినులను ఎంపిక చేసి కోచింగ్ ఇస్తున్నారు. వరంగల్ జిల్లాలో 10 కేజీబీవీల నుంచి 10 మంది విద్యార్థినులు, హనుమకొండలో 9 కేజీబీవీల నుంచి 90 మంది, జనగామలోని 12 కేజీబీవీల నుంచి 14 మంది, ములుగులోని 9 కేజీబీవీల నుంచి 12 మంది, జయశంకర్ భూపాలపల్లిలోని 10 కేజీబీవీల నుంచి 18 మంది విద్యార్థినులు మొత్తం 154 మంది విద్యార్థినులు ఈ కోచింగ్ సెంటర్‌లో ఎప్‌సెట్‌కు ప్రత్యేకమైన శిక్షణ తీసుకుంటున్నారు.

విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలి

డాక్టర్ ఎండి. అబ్దుల్‌హై, హనుమకొండ డీఈవో



ప్రభుత్వం కేజీబీవీ విద్యార్థినుల కోసం మంచి కార్యక్రమం చేపట్టింది. విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. అధ్యాపకులు బోధిస్తున్న విషయాలను నేర్చుకొని అనుమానాలను నివృత్తి చేసుకోవాలి. ఎలాంటి ఒత్తిడులకు గురికాకుండా నెల రోజుల పాటు కష్టపడితే ఎప్‌సెట్‌లో మంచి ర్యాంకు సాధించి వారు కోరుకున్న కళాశాలలో సీటు సాధించే అవకాశం ఉంది. నిబద్ధతతో అధ్యాపకులు విద్యాబోధన చేస్తున్నారు. నెల రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ షార్ట్ టర్మ్ ఎప్‌సెట్ కోచింగ్‌తో విద్యార్థినులు ర్యాంకులు సాధించే అవకాశం ఉంది.



ప్రణాళికాబద్ధంగా శిక్షణ సాగుతోంది..

సముద్రాల సునిత, జీసీడీవో, హనుమకొండ



ప్రభుత్వ ఆదేశాల మేరకు డీఈవో ఆధ్వర్యంలో ఏప్రిల్ 1న హసన్‌పర్తిలోని కేజీబీవీలో కోచింగ్ సెంటర్‌ను ప్రారంభించాం. నెల రోజులకు ప్రణాళికలను రూపొందించుకొని విద్యార్థినులకు కోచింగ్ ఇస్తున్నాం. నిరంతరం పర్యవేక్షిస్తూ, కోచింగ్ క్యాంపు ఎస్‌వో, అధ్యాపకులను సమన్వయం చేస్తూ కోచింగ్ నిర్వహిస్తున్నాం. పేద విద్యార్థినులకు ఎప్‌సెట్‌లో ర్యాంకులు సాధించే విధంగా ప్రభుత్వం ఈ ఏడాది ప్రవేశపెట్టిన కోచింగ్ సెంటర్‌లో లక్ష్యాలను సాధించేందుకు కృషి చేస్తున్నాం. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కేజీబీవీల్లో పనిచేస్తున్న నిష్ణాతులైన పీజీసీఆర్‌టీలు కార్పొరేట్ స్థాయిలో సబ్జెక్టులను బోధిస్తున్నారు. బోధన తరగతులతో పాటు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నాం. మే 1 తో శిక్షణ ముగుస్తుంది. ఈ కోచింగ్ సెంటర్ నుంచి చాలా మంది విద్యార్థులు మంచి ర్యాంకులు సాధిస్తారని ఆశిస్తున్నాం.

ర్యాంక్ సాధిస్తా..

ఎన్. శైలజ, వెంకటాపూర్ కేజీబీవీ, ములుగు



షార్ట్ టర్మ్ కోచింగ్‌తో ఎప్‌సెట్‌లో మంచి ర్యాంకు సాధిస్తా. అధ్యాపకులు అద్భుతంగా బోధిస్తున్నారు. మంచి ఇంజనీరింగ్ కళాశాలలో సీటు సాధిస్తాను. కోచింగ్ సెంటర్‌లో వసతులు బాగానే ఉన్నాయి. ఎలాంటి ఇబ్బందులు లేకుండా చదుకునేందుకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటా..

ఎం.బేబి, పాలకుర్తి కేజీబీవీ, జనగామ జిల్లా



కేజీబీవీల్లో ఈ ఏడాది ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసిన విద్యార్థులకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన షార్ట్ టర్మ్ ఎప్‌సెట్ కోచింగ్‌ను సద్వినియోగం చేసుకుంటాను. ఈ నెల రోజుల పాటు లెక్చరర్లు బోధిస్తున్న పాఠ్యాంశాలను శ్రద్ధగా చదువుతూ మంచి ర్యాంకు సాధిస్తాను. ఇక్కడి కోచింగ్ సెంటర్‌లో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. లెక్చరర్లు అందరూ బాగా బోధిస్తున్నారు.

మే 1నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

వరంగల్ స్పోర్ట్స్, ఏప్రిల్15: తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (సాట్) ఆదేశాల మేరకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ) ఆధ్వర్యంలో మే 1నుంచి 31వ తేదీ వరకు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడల అధికారి అశోక్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో శిక్షణ పొందేందుకు 4వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న బాల బాలికలు అర్హులని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంతో పాటు ఇతర క్రీడా మైదానాలలో పలు క్రీడాంశాలలో అనుభవజ్ఞులైన కోచ్‌ల ద్వారా నామమాత్రపు ఫీజు (పేఅండ్‌ప్లే) పద్ధతిన నెల పాటు శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. అదే విధంగా మండల, గ్రామీణ ప్రాంతాలలో నిర్వహించనున్న క్రీడా శిక్షణ శిబిరాలను ఉచితంగా నిర్వహిస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాలో క్రీడా శిబిరాలను నిర్వహించేందుకు పీడీ, పీఈటీ లేదా సీనియర్ క్రీడాకారులు ఈ నెల 25వరకు హనుమకొండ జేఎన్ ఇండోర్ స్టేడియంలోని డీఎస్ఏ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన వెల్లడించారు. మరిన్ని వివరాల కోసం 9392997668 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వరంగల్ లోక్‌సభ ఎన్నిక ఓబీసీ ఇన్‌చార్జ్‌ల నియామకం

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 15: వరంగల్ లోక్‌సభ ఎన్నికలో భాగంగా ఓబీసీ సెల్ నాయకులను ఇన్‌చార్జీలుగా నియమిస్తూ టీపీసీసీ ఓబీసీ సెల్ రాష్ట్ర చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్ ప్రకటించారు. ఇన్‌చార్జిగా నియమితులైన వారిలో ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ బొమ్మతి విక్రమ్ ముదిరాజ్, స్టేట్ కో-ఆర్డినేటర్ సందుపట్ల ధన్‌రాజ్, జాయింట్ కో-ఆర్డినేటర్లు బండారి జనార్దన్‌గౌడ్, పులి గణేశ్ ఉన్నారు. లోక్‌సభ ఎన్నికలో పార్టీ అభ్యర్థి డాక్టరు కడియం కావ్య గెలుపు కోసం వీరు బాధ్యతలను నిర్వహించనున్నారు.

నవజాత శిశువు మృతదేహం లభ్యం



చెరువులో లభ్యమైన శిశువు మృతదేహం

ఎల్కతుర్తి, ఏప్రిల్ 15: ఎల్కతుర్తి మండలంలోని గోపాల్‌పూర్ గ్రామ చెరువులో సోమవారం ఓ నవజాత మగ శిశువు శవం లభ్యమైంది. గ్రామ శివారులోగల చెరువులో నవజాత శిశువు శవం కనిపించడంతో గ్రామస్తులు భారీగా వెళ్లి చూశారు. దీంతో సమాచారం తెలుసుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి తరలివెళ్లి పరిశీలించారు. శిశువు చేతులకు చికిత్సకు సంబంధించిన ప్లాస్టర్ వేసి ఉన్నాయి. దీంతో ఏవరో ఆస్పత్రి నుంచి తీసుకొచ్చి చెరువులో వేసి ఉంటారని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేశారు. శిశువు ఎండతాకిడికి తట్టుకోలేక మృతి చెంది ఉంటుందని గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులు పలు కోణాలలో ఆరా తీస్తున్నారు.

ప్రజలను ఓటడిగే హక్కు కోల్పోయిన కేసీఆర్

తెలంగాణ ఉద్యమకారుల చైర్మన్ కూరపాటి వెంకట నారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటనారాయణ

కాజీపేట జంక్షన్, ఏప్రిల్ 15: ప్రజలు నమ్మి అధికారం ఇస్తే రాష్ట్రాన్ని సర్వనాశనం చేసి అధికారం కోల్పోయిన కేసీఆర్ ప్రస్తుతం బలమైన ప్రతిపక్షం ఉండాలని ప్రజలకు హితబోధ చేస్తున్నారని తెలంగాణ ఉద్యమకారుల చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకట నారాయణ అన్నారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని తన స్వగృహంలో ఉద్యమకారులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ తెలంగాణ ప్రజలను ఓటు అడిగే హక్కును కోల్పోయిన విషయాన్ని మర్చిపోతున్నాడని ఆయన అన్నారు. బీఆర్ఎస్ పార్టీకి ఎవరూ ఓటు వేయవద్దని, ఆ పార్టీ అభ్యర్థిని కూడా గెలవకుండా చూడాల్సిన అవసరం ఉందని తెలంగాణ ఉద్యమకారులకు ఆయన పిలుపునిచ్చారు. దశాబ్దకాలంలో ప్రజల గొంతుకలైన ప్రతిపక్షాలను చీల్చి బ్లాక్‌మెయిల్ చేసి తాయిలాలు ఇచ్చి నాయకులకు దోపిడీ చేయడానికి అవకాశం కల్పించి ప్రజల భూములను, ప్రభుత్వ ఖజానాను కొల్లగొట్టి చరిత్ర సృష్టించారని ఆయన పేర్కొన్నారు.

కుమార్తె లిక్కర్ స్కాంలో జైలుపాలైందని, వారి కుటుంబానికి దగ్గరి బంధువులకు, అధికారులకు అందినంత దోపిడీ చేసుకోవడానికి అవకాశాలు ఇచ్చి విధ్వంసం సృష్టించారని ప్రజలు ఇటీవల జరిగిన ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పి ప్రగతి భవన్ నుంచి గెంటివేశారని ఆయన ఎద్దేవా చేశారు. విద్యాసంస్థలను నిర్వీర్యం చేసి బహుజన వర్గాలను అణచివేసిన కల్వకుంట్ల కుటుంబాన్ని ప్రజలు రాజకీయంగా బొందపెట్టాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో అభ్యర్థులను నిలబెట్టి ప్రజలను మోసంగించే మాటలు చెప్పి పార్టీని బతికించుకొని ఆస్తులను కాపాడుకోవడానికి కేసీఆర్ బస్సు యాత్రలు, రోడ్‌షోలు సిగ్గుపడకుండా కొనసాగిస్తున్నాడని అన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు నెలకు సుమారు రూ.25వేల కోట్ల వడ్డీలు కట్టవలసిన దుస్థితి ఏర్పడిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వానికి మరో ఆరునెలల కాలం నుంచి పథకాలు అమలు చేయడానికి అవకాశం ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఈ క్లిష్టమైన సమయంలో ప్రజలు తమ ఓటును దోపిడీదారులకు వేయకుండా జాగ్రత్తపడా లని ఆయన విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఇంకా ఉద్యమకారులు డాక్టర్ కె. వీరస్వామి, చింతకింది కుమారస్వామి పాల్గొన్నారు.

వడ్డీ మాఫియా!

(5వ పేజీ తరువాయి)

ప్రాంతంలో ఇద్దరు కార్పొరేటర్లు, మరో పది మంది చోటామోటా లీడర్లు ఈ ఫైనాన్స్ దందాలో ఉన్నారని, వీరికి రాజకీయ నేతల అండదండలతో పాటు పోలీసులు సహకారం ఉందనే ప్రచారం జరుగుతోంది. కొందరు ఖాకీలు కూడా ఫైనాన్స్‌లో భాగస్వాములుగా ఉన్నారని, దీంతో అధిక వడ్డీల దందా మూడు పువ్వులు ఆరు కాయాలు చందంగా సాగుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అలాగే జనగామ జిల్లాలో జనగామ, స్టేషన్‌ఘనపూర్, వరంగల్ జిల్లా నర్సంపేట, వర్ధన్నపేట, హనుమకొండ జిల్లా పరకాల, కమలాపూర్ ప్రాంతాల్లో భారీగా అక్రమ ఫైనాన్స్ దందా సాగుతోంది. అయితే వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో జరుగుతున్న గిరిగిరి దందాలో రాజకీయ నేతలతో పాటు కొన్ని ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ టీచర్లు కూడా ప్రముఖంగా ఉన్నట్టు సమాచారం. రియల్ ఎస్టేట్ వ్యాపారం కుదేలవడంతో చాలా మంది రియల్టర్లు కూడా అధిక వడ్డీ వ్యాపారంలోకి అడుగు పెడుతున్నారు. లక్ష పెట్టుబడి పెడితే సంవత్సరం తిరుగక ముందే లక్ష రుపాయలు వడ్డీ వస్తుండటంతో కోట్లాది రుపాయలను వడ్డీ వ్యాపారంలో పెట్టి పేదలను జలగల్లా పీడిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా జరుగుతున్న ఈ అధిక వడ్డీ వ్యాపారంపై పోలీసులకు ఫిర్యాదుల అందిన పట్టించుకోవటం లేదనే ఆరోపణలున్నాయి. ఎదైనా సంఘటన జరిగినప్పుడే హడావిడి చేసి చేతులు దులుపుకోవటం మినహా పోలీసులు చేసేదేమీ ఉండదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సుధీర్‌కుమార్

కేటీఆర్‌ను కలిసిన సుధీర్‌కుమార్

రాంనగర్, ఏప్రిల్ 15: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను వరంగల్ లోక్‌సభ అభ్యర్థి మారపెల్లి సుధీర్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం హైదరాబాద్‌లో కేటీఆర్‌ను కలిసి తనకు అవకాశం ఇచ్చినందుకు సుధీర్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీలు మధుసూధనాచారి, శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, నేతలు వినయభాస్కర్, రాజయ్య, గండ్ర వెంకటరమణారెడ్డి, నన్నపునేని నరేందర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, చల్లా ధర్మారెడ్డి తదితరులున్నారు.

మార్కెట్లో మరింత తగ్గిన మిర్చి ధరలు

వరంగల్ వ్యవసాయం, ఏప్రిల్ 15: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో మిర్చి ధరలు మరింత తగ్గాయి. ఈనెల 5న పలికిన ధరలకు సోమవారం పలికిన ధరకు చాలా తేడా ఉంది. వరుస సెలవుల రావడంతోపాటు రోజురోజుకూ ధరలు పతనమవుతుండడంతో రైతులు తమ దగ్గర ఉన్న మిర్చి పంటను వెంటనే అమ్ముకునేందుకు మార్కెట్‌కు తరలిస్తున్నారు. దీంతో మార్కెట్‌కు మిర్చి బస్తాలు పోటెత్తుతున్నాయి. మిర్చి పెద్దఎత్తున రావడంతో ధరలు పడిపోతున్నాయని వ్యాపార వర్గాలు చెపుతున్నాయి.

మిర్చి ధర క్వింటాల్లో...

రకం	మార్చి 6న	ఏప్రిల్ 10న	ఏప్రిల్ 15న
తేజ రకం	రూ.20,300	రూ.19,000	రూ.18,300
వండర్‌హాట్	రూ.19,500	రూ.15,500	రూ.15,000
యుఎస్ 341	రూ.18,000	రూ.15,200	రూ.15,500
దేశీ	రూ.38,000	రూ.26,000	రూ.27,000
సింగిల్‌పట్టి	రూ.42,500	రూ.43,500	రూ.30,000
తాలు	రూ.8,500	రూ.7,000	రూ.7,000

పీహెచ్‌సీకి రూ.9లక్షల వస్తువుల అందజేత



వైద్యాధికారికి వస్తువులు అందజేస్తున్న సంస్థ బాధ్యులు

గూడూరు, ఏప్రిల్ 15 : గూడూరు మండలం తీగలవేణి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అదే గ్రామానికి చెందిన మిడ్‌వెస్ట్ గ్రానైట్ సంస్థ ఆధ్వర్యంలో రూ.9 లక్షల విలువైన వివిధ వస్తువులను సోమవారం అందజేశారు. మిడ్‌వెస్ట్ గ్రానైట్ మేనేజర్ వినేందర్‌రెడ్డి, అకౌంట్స్‌మేనేజర్ గౌండ్ల మల్లయ్య, హెచ్‌ఆర్ డిపార్ట్‌మెంట్ ఇంచార్జి రామకృష్ణలు సుమారు రూ.9 లక్షల విలువైన రెండు ఏసీలు, రెండు బీరువాలు, ల్యాప్‌టాప్, ల్యాబ్ సర్జికల్ వస్తువులు, కంప్యూటర్ ప్రింటర్, కమ్యూనిటీ హాల్ కనస్ట్రక్షన్‌లను మెడికల్ ఆఫీసర్ రాంబాబుకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో విద్య, వైద్యానికి అన్నివిధాలుగా మిడ్‌వెస్ట్ సంస్థ నుంచి సహకారం అందించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది కిరణ్, ఉదయశ్రీ, సురేష్, రమేష్, అమల, దాసు, మనోహర్ పాల్గొన్నారు.

పంటల బోనస్‌ను తక్షణమే అమలు చేయాలి

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 15 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ధాన్యం క్వింటాకు రూ.500 బోనస్‌తో పాటు అన్ని రకాల వ్యవసాయ పంటలకు బోనస్ ఇస్తామని ప్రకటించి అధికారంలోకి వచ్చిన తర్వాత దాని ఊసే ఎత్తడం లేదని అఖిల భారత రైతుకూలీ సంఘం(ఏఐకేఎంఎస్) రాష్ట్రఅధ్యక్షుడు మామిడాల భిక్షపతి విమర్శించారు. మహబూబాబాద్‌లోని ఆ సంఘం కార్యాలయంలో సోమవారం రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు రుణమాఫీ అమలు చేయకుండా ఐదేళ్లు కాలం వెల్లదీసిందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని చెప్పి పట్టించుకోవడం లేదన్నారు. సమావేశం అనంతరం ఐదు తీర్మానాలను ఆమోదించారు. సమావేశంలో జడ సత్యనారాయణ, సత్యం, ఐలయ్య, బాలరాజు, ఊక్లా, వెంకటయ్య పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరేద్దాం

▸ పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి



పార్టీలో చేరిన వారితో హనుమాండ్ల ఝాన్సీరెడ్డి

పెద్దవంగర, ఏప్రిల్ 15 : పార్లమెంట్ ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు కష్టపడి కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. మండలంలోని అవుతాపురం బీఆర్ఎస్ మాజీ సర్పంచ్ సల్దెండి మంజులు సుధాకర్, మహంకాళి, శ్రీకాంత్, యాకన్న, మహేష్, వెంకటసోములు, కర్నాకర్, రవి, శోభన్, వెంకన్నతో పాటు పలువురు నాయకులు సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల ప్రజాప్రతినిధులు కాంగ్రెస్‌లో చేరుతున్నారని తెలిపారు. బూత్ స్థాయి నుంచి పార్టీని పటిష్ఠం చేస్తూ త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్‌యాదవ్, హరికృష్ణ, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

గార్లలో అగ్ని ప్రమాదం

గార్ల, ఏప్రిల్ 15 : మండల కేంద్రంలోని జీవంచిపల్లి కాలనీలో వెదురు బొంగుల చెట్లకు ప్రమాదవశాత్తు నిప్పంటుకొని సోమవారం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. జీవంచిపల్లిలోని బోడ అశోక్ చెందిన వెదురు బొంగుల పొదల్లో ఎండ తీవ్రత అధికం కావడంతో గాలిరాపిడికి నిప్పులు చెలరేగి మంటలు వ్యాపించాయని స్థానికులు తెలిపారు. దీంతో అప్రమత్తమై అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించగా, సకాలంలో చేరుకుని మంటలను ఆర్పి పెద్ద ప్రమాదం జరుగకుండా కాపాడారు.

అంగన్‌వాడీ కేంద్రాలు అమ్మఒడిని తలపించాలి

మరిపెడ, ఏప్రిల్ 15 : అంగన్‌వాడీ కేంద్రాలు ఇక నుంచి అమ్మఒడిని తలపించే విధంగా టీచర్లు పని చేయాలని మరిపెడ సీడీపీవో కె.శిరీష అన్నారు. సోమవారం మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని సీతారాంపూర్-1 అంగన్‌వాడీ సెంటర్‌లో సెక్టార్ పరిధికి చెందిన అంగన్‌వాడీకేంద్రాల నిర్వాహకులు ప్రీ గ్రాడ్యుయేషన్(ఈసీసీఈ) కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మతోన్మాద బీజేపీని ఓడించండి

▸ సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర నాయకుడు నాగయ్య

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 15: పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించి ప్రధాని మోదీని గద్దె దించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య పిలుపునిచ్చారు. మహబూబాబాద్‌లోని పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో సీపీఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశాన్ని సోమవారం మునిసిపల్ ఫ్లోర్ లీడర్ సూర్నపు సోమయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జి.నాగయ్య మాట్లాడుతూ.. బీజేపీ మూడవసారి అధికారంలోకి వస్తే మోదీ ప్రభుత్వం దేశాన్ని తిరోగమనం వైపు తీసుకుపోయేలా ప్రణాళికలు రచిస్తుందని విమర్శించారు. 370 స్థానాల్లో గెలుస్తామని చెబుతున్న ప్రధాని మోదీకి ఓటమి భయం పట్టుకుందన్నారు. అందుకే బలమైన ప్రతిపక్ష రాజకీయ పార్టీల ఆర్థిక వనరులను(అకౌంట్) సీజ్ చేయడం, ఈడీ, సీబీఐ సంస్థలచే బెదిరింపులకు పాల్పడుతున్నారని చెప్పారు. బీజేపీ నిజస్వరూపం ప్రజలకు అర్థమైందని.. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఇంటికి సాగనంపడం ఖాయమన్నారు. బీజేపీ మళ్లీ గెలిస్తే భారత రాజ్యాంగాన్ని మార్చే ప్రమాదం ఉందని, ముస్లింలు, క్రిస్టియన్లకు రక్షణ లేకుండా పోతుందని చెప్పారు. బీజేపీని ఓడించేందుకు ప్రజలను చైతన్య వంతులను చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గునిగంటి రాజన్న, అల్వాల వీరయ్య, బానోత్ సీతారాం నాయక్, సమ్మెట రాజమౌళి, దుడ్డెల రాంమూర్తి, కుర్ర మహేష్ పాల్గొన్నారు.

సమాజ సేవలో భాగస్వామ్యం కావాలి

పెద్దవంగర, ఏప్రిల్ 15 : సమాజ సేవలో యువత భాగస్వామ్యం కావాలని జన వికాస ప్రతినిధి సరిత, పంచాయతీ కార్యదర్శి గీత అన్నారు. మండలంలోని చిన్నవంగర గ్రామంలో సోమవారం బొమ్మర నాగేష్ సహకారంతో జన వికాస ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవిలో బాటసారుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సామాజిక సేవలో జన వికాస సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు, మౌనిక, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంలో జాగ్రత్తలు పాటించాలి

చిన్నగూడూరు, ఏప్రిల్ 15 : వేసవి నేపథ్యంలో నర్సరీలలో మొక్కల పెంపకం విషయంలో తగు జాగ్రత్తలు పాటించాలని మండల ప్రత్యేక అధికారి(డీడబ్ల్యూవో) వరలక్ష్మి సూచించారు. మండలంలోని జయ్యారం, మన్నెగూడెం గ్రామాల్లో గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీలను సోమవారం ఆమె పరిశీలించారు. వనసేవకుల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం చిన్నగూడూరు, జయ్యారం గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేసిన చలివేంద్రాలను సందర్శించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామారావు, ఎంపీవో యాకయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

డబుల్ బీటీ రోడ్డుగా మార్చాలని వేంకు వినతి

కేసముద్రం, ఏప్రిల్ 15 : కేసముద్రం మండలం అర్పనపల్లి, కాట్రపల్లి మీదుగా గూడూరు మండలం గుండెంగ వరకు ఉన్న సింగిల్ మార్గాన్ని డబుల్ బీటీ రోడ్డుగా మార్చాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని టీపీసీసీ సభ్యుడు గుగులోత్ దస్రూనాయక్ కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లో సోమవారం వేం నరేందర్‌రెడ్డిని దస్రూనాయక్ కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ రోడ్డు గుంతలమయమై రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, పంచాయతీరాజ్ శాఖ పరిధిలో ఉన్న రోడ్డును ఆర్‌అండ్‌బీకి మార్చాలని కోరారు.

రైల్వే స్టేషన్‌లో పోలీసుల తనిఖీలు

డోర్నకల్, ఏప్రిల్ 15: డోర్నకల్ రైల్వేస్టేషన్‌లో సోమవారం పోలీసులు, ఆర్పీఎఫ్ సిబ్బంది తనిఖీలు చేపట్టారు. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా అనుమానిత ప్రయాణికుల బ్యాగులను తనిఖీ చేశారు. అదే సమయంలో వచ్చిన షిర్డీ ఎక్స్‌ప్రెస్‌లో బోగీలను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ ఉపేందర్‌రావు మాట్లాడుతూ... రైళ్లలో నిషేధిత వస్తువులతో పాటు అక్రమంగా నగదు తరలిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే రైల్వే పరిసరాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న కొందరిని ప్రశ్నించి వదిలివేసినట్లు చెప్పారు.

అగ్నిమాపక సిబ్బంది మాక్ డ్రిల్

మరిపెడ, ఏప్రిల్ 15 : అగ్ని ప్రమాదాల నివారణకై ప్రజలకు అవగాహన కోసం సోమవారం మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని కార్గిల్ సెంటర్‌లో ఎన్‌హెచ్‌ఏ 365-563పై మరిపెడ ఫైర్ సిబ్బంది మాక్ డ్రిల్ నిర్వహించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా వివిధ రూపాలతో కూడిన ఈ మాక్ డ్రిల్‌తో అగ్నిమాపక సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. ఎగిసి పడే మంటలను ఎలా అరికట్టడం, ఏఏ గ్రీల్స్‌ను ఎలా ఉపయోగించి మంటలను ఆర్పాలో వివరించి అగ్ని ప్రమాదాల పట్ల ప్రజలను జాగృతం చేశారు. అగ్నిప్రమాదాలు సంభవిస్తే వెంటనే 101కు సమాచారం ఇవ్వాలని సిబ్బంది సూచించారు. డీవోపీ సంతోశ్‌కుమార్, మెన్స్ రాజు, బాసు లక్ష్మీరామ్ పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలి

డోర్నకల్ : వేసవిలో అగ్నిప్రమాదాలు జరుగకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక శాఖ సిబ్బంది ప్రజలను కోరారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా డోర్నకల్ రైల్వేస్టేషన్ ఆవరణలో సోమవారం అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్‌ను స్థానికులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాల్చిన సిగరేట్లను ఆర్పకుండా ఎక్కడ పడితే అక్కడ వేయొద్దన్నారు. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే 101కు సమాచారం ఇవ్వాలన్నారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్, గ్యాస్ వల్ల జరిగే ప్రమాదాలను ఎలా నివారించాలో ప్రత్యక్షంగా చూపి అవగాహన కల్పించారు. ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. సిబ్బంది చంద్రమౌళి, శ్రీనివాస్, మహేష్, విశ్వనాథ్, కౌన్సిలర్ శరత్‌బాబు, స్థానికులు పాల్గొన్నారు.

గ్రీన్ గంగారంగా తీర్చిదిద్దుతా : ఎంపీడీవో

గంగారం, ఏప్రిల్ 15 : నీతి ఆయోగ్‌కు ఎంపికైన మండలాన్ని గ్రీన్ గంగారంగా తీర్చిదిద్దుతానని ఎంపీడీవో బీరవెల్లి అప్పారావు అన్నారు. మండలంలోని 12 పంచాయతీల పరిధిలో లక్షలాది రూపాయల వ్యయంతో పెంచుతున్న నర్సరీ మొక్కలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంగారం మండలంలో ఇంటింటా పూల మొక్కలు, రోడ్ల వెంట పండ్ల మొక్కలు నాటి గ్రీన్ గంగారంగా మార్చాలనే సంకల్పంతో ఉన్నామన్నారు. అందుకు గాను ప్రతీ పంచాయతీ నుంచి 12వేల మొక్కల చొప్పున 12 పంచాయతీల నుంచి లక్షా 32వేల మొక్కలను పెంచుతున్నట్లు తెలిపారు. వేసవిలో మంచినీటి ఎద్దడి లేకుండా నర్సరీ మొక్కలకు నీరు అందిస్తున్నామని అన్నారు. ఎండలు ఎక్కువైనందున నర్సరీలలో గ్రీన్ క్లాత్‌లు ఏర్పాటు చేసి మొక్కలను సంరక్షిస్తున్నామని చెప్పారు. ఈ మొక్కలను వర్షాలు పడిన తర్వాత జూన్ నుంచి ఆగస్టు లోపు రోడ్ల పక్కన నాటిస్తామని ఎంపీడీవో అప్పారావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్టాఫ్‌నర్సుకు మెమో జారీ

దంతాలపల్లి, ఏప్రిల్ 15: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న సీనియర్ స్టాఫ్‌నర్సు కవితకు సోమవారం జిల్లా వైద్యాధికారి కళావతిబాయి ఆదేశాల మేరకు మెమో జారీ చేసినట్లు వైద్యాధికారి చైతన్య తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్ఎల్ సెలైన్ బాటిల్‌లో నాచురావడం పట్ల ఇటీవల పీహెచ్‌సీలో ఉన్నతాధికారులు విచారణ చేశారన్నారు. ఈ మేరకు ఆమెకు మెమోను జారీ చేస్తున్నామన్నారు.

ఆర్‌ఎంపీలు నిబంధనలు పాటించాలి

నెహ్రూసెంటర్, ఏప్రిల్ 15: ఆర్‌ఎంపీలు ప్రభుత్వ నిబంధనల మేరకే వైద్యం అందించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి బి.కళావతిబాయి సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. ఆర్‌ఎంపీలు తమ స్థాయికి మించి గ్రామాల్లో వైద్యం అందిస్తున్నారని, అవి వికటించి అనేకమంది చనిపోతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని తెలిపారు. వైద్య, ఆరోగ్య శాఖ సూచనల మేరకే ప్రథమ చికిత్స అందించాలని చెప్పారు. ప్రభుత్వ నిబంధనలను పాటించని ఆర్‌ఎంపీలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలి

డోర్నకల్, ఏప్రిల్ 15 : ప్రస్తుతం జరుగుతున్న ఎస్ఏ-2 పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని జిల్లాబీపీఈవో సెక్రటరీ విజయసుశీల అన్నారు. మండలంలోని ముల్కలపల్లి, జడ్పీ హైస్కూల్, మన్నెగూడెం జడ్పీ హైస్కూళ్లను సోమవారం తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడుతూ... విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేసి వార్షిక పరీక్షలకు సంసిద్ధం చేయాలన్నారు. ఆమె వెంట ఉపాధ్యాయులు చాగర్లముడి శ్రీధర్, డీఎస్.వినోద్, సాహెబ్ అలీ, రుక్మాంగదరావు ఉన్నారు.

సీతారామ ప్రాజెక్టు కాల్వల పనులు పూర్తి చేయాలి



వెన్నారంలో కిలోమీటరు 47 వద్ద టన్నెల్ పనులు పరిశీలిస్తున్న క్వాలిటీ కంట్రోలర్ ఈఈ రమణ

డోర్నకల్, ఏప్రిల్ 15 : డోర్నకల్ మండలంలో జరుగుతున్న సీతారామ ప్రాజెక్టు ప్రధాన కాల్వల నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరగా పూర్తి చేయాలని సీతారామ ప్రాజెక్టు క్వాలిటీ కంట్రోలర్ ఈఈ రమణ అన్నారు. మండలంలోని వెన్నారం చెరువువద్ద కిలోమీటరు 47 వద్ద జరుగుతున్న పనులను సోమవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. అండర్ టన్నెల్ పనులను వర్షాకాలం ప్రారంభానికి ముందే పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట క్వాలిటీ కంట్రోల్ డీఈ చంద్రమోహన్, కన్‌స్ట్రక్షన్ ఈఈ మంగళంపల్లి వెంకటేశ్వర్లు, డీఈ రమేష్‌రెడ్డి, నిర్మాణ సంస్థ ఇంచార్జి లక్ష్మీనారాయణ ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యం

మరిపెడ రూరల్, ఏప్రిల్ 15 : కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యమని జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బానోతు రమేశ్‌నాయక్ అన్నారు. మండలంలోని జరుపుల తండాలో సోమవారం పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే పార్లమెంట్ ఎన్నికల్లో మానుకోట కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్‌ను భారీ మెజారిటీతో గెలిపిస్తాయని పేర్కొన్నారు. బూత్ స్థాయి నుంచి పటిష్టం చేస్తూ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్ నాయకత్వంలో కాంగ్రెస్ ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలను అర్హులైన ప్రతీ ఒక్కరికి అందిస్తామని తెలిపారు.

ఆదర్శనీయుడు అంబేద్కర్

మరిపెడ, ఏప్రిల్ 15 : ఆదర్శనీయుడు బీఆర్ అబేంద్కర్ అని మరిపెడ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అప్పికొండ కవిత అన్నారు. సోమవారం కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులు అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి ప్రిన్సిపాల్ కవిత మాట్లాడారు. అణగారిన వర్గాల అభ్యున్నతిని గుర్తించిన మహోన్నతుడు అంబేద్కర్ అని కొనియాడారు.

యువత జ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

నెల్లికుదురు, ఏప్రిల్ 15 : అంబేద్కర్ స్ఫూర్తితో యువత జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఎస్సై క్రాంతికిరణ్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అంబేద్కర్‌వాది బొడ్డు అశోక్ ఆధ్వర్యంలో సోమవారం అంబేద్కర్ ఎవరు, ఆయన ఏమి చేశారు.. అనే పుస్తకం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాగెల్లి శేఖర్, హెచ్.మహేందర్, జిలుకర శ్రీధర్, చీకటి జగదీష్, దాసరి ప్రకాష్, మంద అశోక్, తూళ్ల వెంకన్న, వివేక్, రమేష్ పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

▸ స్వీప్ నోడల్ అధికారి మరియన్న



మహబూబాబాద్ మునిసిపల్ కార్యాలయం ఎదుట ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

మహబూబాబాద్‌టౌన్, ఏప్రిల్ 15: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని స్వీప్ జిల్లా నోడల్ అధికారి మరియన్న అన్నారు. జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి అద్వైత్‌కుమార్‌సింగ్ ఆదేశాలతో స్వీప్ నోడల్ అధికారి మరియన్న ఆధ్వర్యంలో ఓటు హక్కు వినియోగంపై మానుకోట పట్టణంలో సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక మునిసిపల్ కార్యాలయం, ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో సాంస్కృతిక కళాబృందాలచే ఓటు హక్కు ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మరియన్న మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవడం, ఓటు హక్కు ఉన్న వారు ఎన్నికల్లో ఓటు వేయాలని సూచించారు. ఈ నెల 16న ఉదయం 6 గంటలకు మహబూబాబాద్ పట్టణంలో స్వీప్ రన్‌ను నిర్వహిస్తున్నామని, స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద రన్ ప్రారంభమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ నోముల రవీందర్, తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల బృందం సభ్యులు రాంనర్సయ్య, సత్యనారాయణ, రవీందర్, వెంకన్న, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఓబీసీ సెల్ ఇన్‌చార్జ్‌ల నియామకం

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 15 : వచ్చే పార్లమెంట్ ఎన్నికల కోసం రాష్ట్రంలోని అన్ని పార్లమెంటరీ నియోజకవర్గాలకు కాంగ్రెస్ ఓబీసీ సెల్ ఇన్‌చార్జీలను నియమించారు. అందులో భాగంగా మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గానికి ముగ్గురిని నియమిస్తూ కాంగ్రెస్ ఓబీసీ సెల్ రాష్ట్ర చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ ఓబీసీ సెల్ ఇన్‌చార్జీలుగా భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన వంగ రవియాదవ్, మమబూబాబాద్ నియోజకవర్గం కేసముద్రానికి చెందిన ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మేకల వీరన్న, రాష్ట్ర కో-ఆర్డినేటర్‌గా పని చేస్తున్న మానుకోట పట్టణానికి చెందిన పింద్రాల రాందాసు నియామకమయ్యారు. వీరు ముగ్గురు పార్లమెంట్ ఎన్నికల్లో ఓబీసీ సెల్ ఇన్‌చార్జీలుగా వ్యవహరిస్తారు.

మండల కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌లుగా చల్లా, వీరనేని

కొత్తగూడ, ఏప్రిల్ 15 : మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ కొత్తగూడ మండల ఇన్‌చార్జీలుగా చల్లా నారాయణరెడ్డి, వీరనేని వెంకటేశ్వరరావు(లావణ్య వెంకన్న)ను పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బలరాంనాయక్‌ను భారీ మెజారిటీతో గెలిపించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. తమపై నమ్మకంతో ఇన్‌చార్జీలుగా నియమించినందుకు మంత్రి సీతక్క, కేంద్ర మాజీ మంత్రి, ఎంపీ అభ్యర్థి బలరాం నాయక్, మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి సూర్యకు కృతజ్ఞతలు తెలిపారు.

మంత్రులకు శ్రీరాములోరి కల్యాణ ఆహ్వాన పత్రిక

▸ అందించిన ఎమ్మెల్యే, ఆహ్వాన కమిటీ

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 15 : మహబూబాబాద్‌లో ఈ నెల 17న నిర్వహించే శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవానికి ప్రభుత్వ సలహాదారు, మంత్రులను ఉత్సవ కమిటీ బాధ్యులు మోహన్‌రావు, ఎడ్ల రమేష్ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లో సోమవారం ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావులను వేర్వేరుగా కలిసి మహబూబాబాద్‌లో మిథిలానగరి తరహాలో అత్యంత వైభవంగా నిర్వహించే 66వ శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవానికి ఆహ్వానించారు.



వేం నరేందర్‌రెడ్డికి శ్రీసీతారాముల కల్యాణ ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

వంద సీట్లకే బీజేపీ పరిమితం

▸ సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారథి



సమావేశంలో మాట్లాడుతున్న విజయసారథి

మహబూబాబాద్‌టౌన్, ఏప్రిల్ 15: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ 100 సీట్లకే పరిమితమవుతుందని, అంతకంటే ఎక్కువ రావని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి అన్నారు. మహబూబాబాద్‌లోని వీర భవన్‌లో సీపీఐ అర్బన్ విస్తృత స్థాయి వర్క్‌షాప్‌ను పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయసారథి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ప్రధాని మోదీ ప్రభావం తగ్గిపోయిందని, బీజేపీ పాలనలో కార్పొరేట్ శక్తులకు మేలు జరిగిందే తప్ప సామాన్యులకు ఏ మాత్రం లబ్ధి చేకూరలేదన్నారు. మోదీ పాలనలో దేశ ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారని, బీజేపీకి 100 సీట్లు మించి రావన్నారు. ఇండియా కూటమికి 400 సీట్లు వస్తాయని, కేంద్రంలో వచ్చేది ఇండియా కూటమి ప్రభుత్వమేనని చెప్పారు. సీపీఐ శ్రేణులు ప్రజల వద్దకు వెళ్లి మతోన్మాద బీజేపీని ఓడించడానికి వర్క్‌షాప్ ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. బీజేపీని ఓడించడమే లక్ష్యంగా పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో మునిసిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథి రెడ్డి, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, వీరవెల్లి రవి, వెలుగు శ్రావణ్, చిరంజీవి, ఫాతిమా, చిదిరాల జ్ఞానేశ్వర్, యాకమ్మ,రవీందర్, రాజకుమారి పాల్గొన్నారు.

వడదెబ్బతో మేకలకాపరి మృతి

దంతాలపల్లి, ఏప్రిల్ 15 : మండల కేంద్రంలో ఓ మేకల కాపరి వడదెబ్బకు గురై సోమవారం మృతి చెందారు. స్థానికులు తెలిపిన ప్రకారం... దంతాలపల్లికి చెందిన కన్నబోయిన కృష్ణమూర్తి(60) అనే వృద్ధుడు రోజు మాదిరిగా తనకున్న మేకలను శివారులో మేపేందుకు వెళ్లారు. ఈ క్రమంలో మధ్యాహ్నం ఎండ తీవ్రతకు వడదెబ్బ తగిలి కుప్పకూలిపోయాడన్నారు. విషయం తెలుసుకున్న బంధువులు ఇంటికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందాడు. కాగా,ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు



పార్టీలో చేరిన వారితో కాంగ్రెస్ సీనియర్ నాయకులు

తొర్రూరు, ఏప్రిల్ 15 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో తొర్రూరు, వివిధ గ్రామాల బీఆర్ఎస్ నాయకులు భారీగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని నియోజకవర్గ సీనియర్ నాయకుడు పెదగాని సోమయ్య తెలిపారు. సోమవారం పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో పలువురు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీలకు చెందిన వారు కాంగ్రెస్‌లో చేరుతున్నారని తెలిపారు. పార్టీలో చేరిన వారిలో మహంకాళి అశోక్, మన్నూరి ఉమ, పాలిశెట్టి వాసు దంపతులతో పాటు మరో వంద మంది కార్యకర్తలు ఉన్నారన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు రాంచంద్రయ్య, సురేందర్ రెడ్డి, ఎల్.వీ గౌడ్, దరావత్ వెంకన్న, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఎంపీ, మాజీ ఎమ్మెల్యే పరామర్శ

గూడూరు, ఏప్రిల్ 15 : గూడూరు మండల కేంద్రానికి చెందిన బొంత వెంకటేష్ కుటుంబాన్ని ఎంపీ మాలోతు కవిత, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్‌లు సోమవారం వేర్వేరుగా పరామర్శించారు. గూడూరుకు చేరుకుని బొంత వెంకటేష్ మృతదేహంపై పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం వెంకటేష్ తల్లిదండ్రులు బొంత రాములు-ఐలమ్మ, భార్య దేవత, కుమార్తె, కుమారుడిని పరామర్శించి ధైర్యం చెప్పారు. వారి వెంట సంపత్‌రావు, సురేందర్, కటార్‌సింగ్, వల్లపు శ్రీనివాస్, సంపంగి రాంచందర్, రాములు, రహీం, ఎల్లయ్య, వరుణ్, నాగరాజు, స్టాలిన్, వెంకన్న, అశోక్, హైమత్, వేణుమాధవ్‌రెడ్డి, దేవేంద్రాచారి పాల్గొన్నారు.

నవమి కరపత్రాల ఆవిష్కరణ

తొర్రూరు, ఏప్రిల్ 15: శ్రీరామ నవమిని పురస్కరించుకుని ఈ నెల 17న పట్టణంలో భారీగా నవమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బిజ్జాల అనిల్‌కుమార్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు మచ్చ సురేష్ తెలిపారు. బుధవారం ఉదయం 11.45 గంటలకు పట్టణంలోని పాటిమీద గల రామాలయం, శ్రీకృష్ణ మందిరం ఆవరణలో రాములవారి కల్యాణ వేడుకలు వేద పండితులచే అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉదయం 8గంటల నుంచి పూజా కార్యక్రమాలు, కలశ స్థాపన, కల్యాణం అనంతరం ప్రసాద వితరణ, పారాయణాలు, భజన కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.